కథ

# అమ్మ


'అమ్మ ఎక్స్‌పైర్డ్' అని టెలిగ్రాం వచ్చింది బెంగ ళూరులో వున్న భావనారాయణకీ, కలకత్తాలో ఉంటున్న కళ్యాణ చక్రవర్తికీ. ఇద్దరూ టెలిగ్రాం చూసి తెల్లబోయారు. టెలిగ్రాం ఏమీ అర్థం కావడం లేదు. ఎవరీ 'అమ్మ'? ఎవరి అమ్మ? తమ అమ్మ ఎప్పుడో 'చచ్చిపోయింది' పదిహేను ఇరవై ఏళ్ల కిందట.. ఇప్పుడు హఠాత్తుగా ఎక్కణ్ణుంచి ఊడిపడిందీ 'అమ్మ'?

**భాగవతుల రామారావు**

ఆదుర్దాగా మళ్లీ టెలిగ్రాం మరో మారు చదివాడు భావనారాయణ. టెలిగ్రాం కాశీ (బెనారేస్) నుంచి వచ్చింది. పంపిన వారు 'మేనేజర్, 'అమ్మ' ఆశ్రమం' అని వుంది. అంటే చనిపోయిన 'అమ్మ' ఓ ఆశ్రమం నడుపు తున్నదన్నమాట. ఎక్కడో కాశీలో ఆశ్రమం నడుపుతున్న ఓ 'అమ్మ' చనిపోతే తనకెందుకూ ఇచ్చారు టెలిగ్రాం?

ఇరవయ్యేళ్ల క్రిందట-అప్పుడు ఒక్కర్తే వైజాగులో ఉండేది- అదృశ్యం అయిన అమ్మ అతని జ్ఞాపకాల్లోంచి ఏనాడో కనుమరుగయింది. బంధుమిత్ర వర్గం అంతా ఆమె చనిపోయిందనే నిర్ధారించారు. ఇన్నేళ్ల తర్వాత కాశీలో ఇప్పుడు చనిపోయిన ఈ 'అమ్మ' ఎవరు? అమ్మపేరు అన్నపూర్ణమ్మ. ఈ చచ్చిపోయిన 'అమ్మ'కి పేరు లేదా? 'అమ్మ' అంటే ఎవరికి అర్థం అవుతుంది?

ఇలాంటి సంకట పరిస్థితి వచ్చినప్పుడు అతను సంప్రదించేది భార్యామణినే. ఆమె అతని ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్. కిట్టనివాళ్లు ఆమె అతని రిమోట్ కంట్రోల్ అంటారు. ఎందుకంటే భావనారాయణ బయటి ప్రపంచానికి పేరు మోసిన పెద్ద డాక్టరే కావొచ్చు. కానీ అతను భార్యను సంప్రదించందే ఏ పనీ చెయ్యడు. ఏ నిర్ణయమూ తీసుకోడు.



భర్త ఎంతో భావోద్వేగంతో చెప్పిన విషయం విని ఫకాలున నవ్వింది భార్యామణి. ఆవిడ ఓ ఎం.ఎల్.ఏ కూతురాయె. రాజకీయం, లౌక్యం ఆమెకు ఉగ్గుతో ఒంటబట్టిన విద్య. ''ఎంత అమాయకులండీ మీరు! తలా తోకా లేని టెలిగ్రాం వస్తే ఇంతలా బుర్ర పాడు చేసుకోవాలా? అంతలా మీరు హైరానా పడ్డానికి అందులో ఏముందండీ? ఎవరో 'అమ్మ' ఎక్కడో చచ్చిపోతే మీకెందుకు ఇంత ఆందోళన? ఇక ఆవిడ ఎవరో అయితే మీకే ఎందుకు టెలిగ్రాం రావాలంటారు? ఆమె వస్తువుల్లో ఆశ్రమం వారికి మీ విజిటింగ్ కార్డు దొరికి వుంటుంది. బహుశా పూర్వాశ్రమంలో ఆమె మీ చేత ట్రీట్‌మెంట్ చేయించుకుని ఉంటుంది. భవిష్యత్తులో పనికొస్తుందని ఆమె మీ కార్డు దగ్గర ఉంచుకుని ఉంటుంది. ఆమె చనిపోయాక ఆశ్రమం వాళ్లకి ఆ కార్డు దొరికితే ఆమెకు కావలసినవాళ్లు కాబోలని ఆ ఎడ్రస్‌కి టెలిగ్రాం ఇచ్చుంటారు. ఈ మాత్రం దానికి మీరు ఇంతలా రియాక్టవడం ఏం బాగులేదు. టేకిట్

ఈజీ'' అంది.


సరిగ్గా అప్పుడే భావనారాయణ బుర్రలో ఓ బాంబు పేలింది. అమ్మ చనిపోయిందని అందరూ అనుకుంటున్నారే కానీ అమ్మ శవాన్ని ఎవరూ చూడలేదు. ఇరవైయ్యేళ్ల కిందట వైజాగులో ఉంటున్న అమ్మ ఉన్నట్టుండి అదృశ్యం అయింది. తర్వాత ఆమెను చూసినవాళ్లెవరూ లేరు. ఏవేవో పుకార్లు తప్ప. 1991 గోదావరి పుష్కరాల్లో కొట్టు కొచ్చిన శవం అచ్చంగా అమ్మలాగే వుందని కొందర న్నారు. మొత్తానికి ఏళ్ల తరబడి అమ్మ ఆచూకీ తెలి యకపోవడంతో అందరూ అమ్మ చచ్చిపోయిందనే నిర్ణయానికొచ్చారు. ఇప్పుడు 'అమ్మ' చనిపోయిం దని తన పేరు వచ్చిన టెలిగ్రాంని పెళ్లాం చెప్పినంత తేలిగ్గా కొట్టిపారెయ్యడానికి వీల్లేదు. చనిపోయిన 'అమ్మ' మా అమ్మేనేమో! బెనారెస్ వెళ్తే నిజం తెలుస్తుంది.

''నువ్వెన్ని చెప్పు, నేను బెనారెస్ వెళ్తున్నాను''

వెంటనే ట్రావెల్ ఏజన్సీకి ఫోన్ చేశాడు. మరో రెండు గంటల్లో విమానంలో కూచుని మేఘాల్లో తేలిపోయి వెళ్తున్న భావనారాయణ ఆలోచన్లు అంతకంటే సూపర్‌సోనిక్ స్పీడులో గతంలోకి దూసుకుపోతున్నాయి. ఈ 'అమ్మ' తన అమ్మే కాదు కదా? అమ్మ!

★ ★ ★

ప్రపంచంలో పిల్లల కోసమే బతికిన తల్లిదండ్రు లెవరంటే ముందు అమ్మానాన్నల పేర్లే చెప్పాలి. ప్రాణానికి ప్రాణంగా ప్రేమానురాగాల్తో పెంచారు నన్నూ తమ్ముణ్ణీ. మా ఇద్దరికీ వయసులో ఒక్క ఏడాదే తేడా గనక స్కూల్లో ఇద్దరం ఒకే క్లాసులో చేరాం. మా నాన్న అప్పట్లో రైల్వేలో గార్డుగా పనిచే సేవారు. మా అమ్మ పెద్దచదువులు చదవకపో యినా అమ్మకి తెలియని శాస్త్రాలు లేవు. భారత




ఆ మాటే అన్నాడు పెళ్లాంతో, ''నేను ఇవాళే బెనారెస్ వెళ్తున్నాను''

అతడి మొహంలో మొదటిసారి మగవాడి ఎసర్టి వ్‌నెస్ ప్రస్ఫుటించడంతో విస్తుపోయిన భార్యా మణి తన అహాన్ని కాస్త అదుపులో పెట్టుకుని ''మీ ఆందోళనని నేను అర్థం చేసుకోగలను. అయితే నిన్నా, మొన్నా - ఇరవై ఏళ్లక్రిందట కనిపించ కుండా పోయిన మీ అమ్మ ఇంతకాలం బతికే ఉంటారని ఎలా నమ్మారండీ మీరు? బతికే ఉంటే ఆమె వయసు 80 దాటి వుంటుంది. అదృశ్యం అయిన్నాటికే ఆమెకి 60 నిండాయి. ఆరోగ్యమా అంతంత మాత్రంగా ఉండేది. అప్పటికే అక్కుపక్షి లావున్న ఆ ముసలావిడ ఏ ఆసరా లేకుండా ఇన్నేళ్లు- ఇరవై ఏళ్లు- బతికి, ఇప్పుడు చనిపో యుంటారని ఎలా నమ్మారండీ, మీ భ్రమ కాపోతే! అంచేత నామాట విని ఆ టెలిగ్రాం సంగతి మరిచిపోండి. అదీకాక ఎవరో కిట్టనివాళ్లు మిమ్మల్ని ఫూల్ చెయ్యడానికి ఈ టెలిగ్రాం ఇచ్చి వుండొచ్చుకదా?'' అని భర్తని వారించబోయింది.

భాగవత భగవద్గీతాది పారాయణ గ్రంథాలు ఆమెకు కొట్టిన పిండి. నాన్నగారి ఆదాయం కుటుంబం పోషణకి, మా చదువులకి ఇతర ఖర్చులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా సరిపోయేది. కాని మేం కాలేజీ చదువులకి వచ్చేసరికి నాన్న ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. ముఖ్యంగా నాకు మెడిసిన్ లోను, తమ్ముడికి ఇంజనీరింగులోను సీటు దొరికి నప్పుడు డబ్బుకి అమ్మా నాన్నా పడ్డ యాతన ఇంతా అంతా కాదు. ఆఖరికి అంతకుముందు వైజాగులో కొన్న హౌస్‌ప్లాటు మా చదువులకోసం అమ్మేద్దామనుకున్నారు. అందుకు అమ్మ ఒప్పుకో లేదు. ఆ మాత్రం అయివేజు పోగొట్టుకోవడమే తప్ప ఆ డబ్బు ఇద్దరు పిల్లల చదువులకి ఎలాగూ సరిపోదు. అక్కడా ఇక్కడా అప్పు చెయ్యడానికి ప్రయత్నించారు కాని ఫలించలేదు. తాహతు లేని ప్పుడు అత్యాశలకి పోయి లాభం ఏమిటి? మా

చదువులు అక్కడితో ఆపేద్దామని నిశ్చయానికి వచ్చారు నాన్న. చదువుల్లో మణిపూసల్లాంటి పిల్లల బంగారు భవిష్యత్తును ధ్వంసం చేస్తున్నామే అని అమ్మ పడిన క్షోభ ఇంతా అంతా కాదు. కాలు గాలిన పిల్లిలా ఎక్కడెక్కడో తిరిగి, ఎందరెందర్నో యాచించింది. సరిగ్గా అలాంటి విషమ పరిస్థితిలో ఇద్దరు 'పెద్దమనుషులు' మా కుటుంబాన్ని ఆదు కున్నారు. స్థానిక ఎం.ఎల్.ఏ భుజంగంగారు నా చదువు బాధ్యత తాను వహిస్తానంటే, రైల్వే అండ్ సివిల్ కంట్రాక్టరు ఫణిభూషణంగారు తమ్ముడి చదువు బాధ్యత ఆయన తీసుకుంటానని ముందు కొచ్చారు. అమ్మ సంతోషానికి అవధుల్లేవు. ప్రపం చంలో ఇంకా ఇలాంటి మహాత్ములు ఉండబట్టే ప్రపంచం ముందుకు పోతున్నదని ఆ దాతలిద్దర్నీ నిండారా దీవించింది అమ్మ. వాళ్లకా సద్బుద్ధి పుట్టించిన దేవుడికి శతకోటి నమస్కారాలు పెట్టింది. ఆ దాతలిద్దరూ మా అన్నదమ్ముల హయ్యర్ స్టడీస్ విషయంలో ఎంతగా శ్రద్ధ తీసుకు న్నారంటే మా చదువుకయ్యే ఖర్చులు, కాలేజీ ఫీజులు, పుస్తకాల ఖర్చులు, హాస్టలు ఫీజులు అన్నీ తామే భరించారు. అమ్మానాన్న చేత మా గురించి కాణీ ఖర్చు పెట్టనియ్యలేదు. గమ్మత్తేమిటంటే వాళ్లిద్దరికీ మగపిల్లలు లేరు. చెరొక ఆడపిల్ల తప్ప.

కాలం గిర్రున తిరిగింది. ఇప్పుడు నేను డాక్టర్ని, తమ్ముడు ఇంజనీరు. అమ్మా నాన్నల కలలు ఫలించాయి. భుజంగంగారు ఖర్చుకి వెనకా డకుండా బెంగళూరులో నా చేత నర్సింగ్‌హోమ్ పెట్టించారు. కన్నతండ్రి కంటే మిన్నగా ఆయన నా భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తుంటే అతని పట్ల నా మనసు కృతజ్ఞతా భావంతో ఉక్కిరిబిక్కిర యిపోయింది. ఏం చేస్తే అతని ఋణం తీర్చుకోగ లను? అయితే అతని ఋణం తీర్చుకునే అవకాశం అతనే కల్పించారు- తన ఒక్కగాని ఒక్క కూతుర్ని పెళ్లాడి తన యావదాస్తికి వారసుణ్ణి కమ్మని అర్థిం చారు. నాకు నోట మాట రాలేదు. ఇంత చేసింది కాకుండా కాళ్లు కడిగి కూతుర్ని ఇస్తానంటున్న అతను నా కళ్లకి మనిషిలా కాక మహాత్ముల్లా కనిపిం చారు. భుజంగంగారు అన్ని విధాలా ఆదుకోబట్టే కొడుకు ఇంతవాడయ్యాడన్న కృతజ్ఞతా భావంతో మా అమ్మానాన్నా మా పెళ్లికి తథాస్తు అనక తప్ప లేదు. మా పెళ్లి వైజాగు డాల్ఫిన్ హోటల్లో వైభ వంగా జరిగింది. పెళ్లికి పెద్ద పెద్ద వి.ఐ.పి.లు వచ్చారు. అందరు గొప్పవాళ్లముందు వెలవెల బోతూ అమ్మానాన్నా ఓ మూల కూర్చున్నారు. వాళ్లని ఎవరూ పట్టించుకోలేదు కూడా. పెళ్ల య్యాక నవదంపతులం హనీమూన్‌కి కాశ్మీర్ వెళ్లాం. అట్నుంచి వచ్చాక బెంగళూరు వెళ్లి

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

పోయాం. అంచేత లాంఛనంగా పెళ్లయాక మా ఇంట్లో గృహప్రవేశం జరగనూ లేదు, నేటి దాకా నా భార్య మా ఇంట్లో 'కుడికాలు' కాదు, కాలే పెట్టలేదు.

రైల్వే నుంచి రిటైరయ్యాక, ఆ వచ్చిన డబ్బుతో నాన్న వైజాగులో వున్న ప్లాట్‌లో రెండు వాటాల ఇల్లు కట్టుకుని అందులో ఉంటున్నారు. మా తమ్ముడు ఇంజనీరింగ్ పాసయ్యాక ఐ.ఆర్.ఎస్.ఇ.కి కట్టి, రైల్వేలో అప్పటి ఇ.ఐ.ఆర్.గారి కూతుర్నే పెళ్లాడి, వారి ఇల్లరికపు టల్లుడయ్యాడు. తద్వారా అల్లుడూ మామల ఉమ్మడి ఆస్తికి వారసుడయ్యాడు. తమ్ముడి పెళ్లి విషయంలో కూడా అమ్మానాన్నల్ని అదే కృతజ్ఞతా భావం వారి నోరు నొక్కేసింది. ఇద్దరు కొడుకుల్ని ఆదుకున్న దాతలకి ధారాదత్తం చేసి ఆ విధంగా ఋణ విముక్తులం అయ్యామని సంతృప్తిపడ్డారు.

బెంగళూరులో నా నర్శింగ్‌హోమ్ మంచి ఊపందుకుంది. నాకు చేతినిండా పనే-జేబునిండా డబ్బే. అటు మామగారు ఇప్పుడు ఎం.పి. అయిపోయారు. ఆయన పలుకుబడితో నేను ప్రొఫెషన్‌లో ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ, మామకి తగ్గ అల్లుణ్ణనిపించుకున్నాను. పన్లో పని, మా శ్రీమతి ఆలస్యం అమృతం విషం అన్నట్టు నన్ను ఇద్దరు ఆడపిల్లల తండ్రిని చేసింది. ఇటు నర్శింగ్‌హోమ్ మున్నూరు పేషంట్లూ ఆరు అద్భుతాల ఆదాయం అన్నట్టు ఓ వెలుగు వెలిగిపోతోంది.

ఆరోజుల్లోనే నాన్న చనిపోయారని టెలిగ్రాం వచ్చింది. హడావిడిగా వైజాగు బయల్దేరడానికి సిద్ధమవుతుంటే నా శ్రీమతి ''తిరిగి వచ్చేటప్పుడు మీ అమ్మగార్ని మీతో ఇక్కడికి తీసుకొచ్చేయండి. ఒక్కరూ ముసలావిడ అక్కడ అవస్థలు పడ్డం ఎందుకూ? మనకీ ఇంట్లో ఇప్పుడు మనిషి అవసరం. ఇప్పుడు నాన్న ఎం.పి. అయ్యాక అమ్మని తీసుకుని మకాం ఢిల్లీ మార్చేశాక పిల్లల్నీ, ఇంటినీ చూసే వాళ్లు లేరు. మీరు మెత్తబడితే మీ అమ్మని మీ తమ్ముడు లాక్కుపోతాడు'' అని మరీ మరీ చెప్పింది. దుఃఖంలో వున్న ముసలి అత్తగార్ని తీసుకు రమ్మని శ్రీమతి అంతలా చెప్పినందుకు 'నా పెళ్లాం ఎంత మంచిది!' అని మురిసిపోయానే కాని ఆమె మాటల వెనుక దాగివున్న లౌక్యం, స్వార్థం అప్పట్లో నాకు అర్థం కాలేదు.

వైజాగు వెళ్లి నాన్నగారి కర్మకాండలన్నీ జరిపించాక అమ్మని నాతో బెంగళూరు వచ్చేయమని ఇంకా చెబుదామనుకుంటున్నాను, ఇంతలో అదే మాట తమ్ముడు అమ్మని అడిగేడు-తనతో కలకత్తా వచ్చేయమని. వాడి పెళ్లాం పిల్లల్తో ఒక్కర్తీ చేసుకోలేకపోతున్నదట. ఇక్కడ వైజాగులో అమ్మ ఒక్కర్తీ ఉండడం ఎందుకు, తనతో తీసుకుపోతానన్నాడు. 'అమ్మ నా దగ్గరే ఉండాలంటే నా దగ్గరే ఉండాలని' అన్నదమ్ములం ఇద్దరం తీవ్ర ఘర్షణ పడ్డాం. ఆఖరికి మాలో మేం ఓ రాజీకి వచ్చాం. మొదట అమ్మని నేను నాతో తీసుకువెళ్తాను. ఓ ఆర్నెల్లు నా దగ్గర ఉన్నాక, కలకత్తా వెళ్లి తమ్ముడి దగ్గరో ఆర్నెల్లు ఉంటుంది. అమ్మ అంతా విని ''ఇద్దరూ నన్ను మీతో రమ్మన్నందుకు సంతోషం. ఇద్దరూ నన్ను చెరో ఆర్నెల్లు ఉంచుకుంటానన్నందుకు మరీ సంతోషంగా వుంది. కాని నేను ఇప్పట్లో ఎక్కడికీ రాను. ఇంకా నాకు కాళ్లూ చేతులూ ఆడుతున్నాయి. నా బతుకు నేను బతగ్గలను. నా గురించి మీరు తగువులాడుకోవద్దు. ఆరేసి నెల్లు నన్ను పంచుకోనూ వద్దు. అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు మీకు తెలుపుడు చేస్తాను లెండి'' అంది అదే తన ఆఖరిమాటగా.

ఒక్కణ్ణే బెంగుళూరు తిరుగు ముఖం పట్టాను. తమ్ముడు కలకత్తా వెళ్లిపోయాడు. అప్పట్నుంచి తమ్ముడితో కాంటాక్టు క్రమంగా కటాఫ్ అయిపోయింది. ఎవరి వ్యాపకాల్లో వాళ్లం బిజీ అయిపోయాం.

నిజం చెప్పాలంటే ఏడాది గిర్రున తిరిగిపోయింది. కాని నాకు నాన్న సంవత్సరీకం మాటే గుర్తు లేదు. అసలు గుర్తున్నా సంవత్సరీకాలు పెట్టవలసిన బెడద కొడుకులకి లేకుండా చేసింది అమ్మ- అంతకు ఆర్నెలల ముందే ఇల్లు అమ్మేసి ఎక్కడికో వెళ్లిపోయింది.

అమ్మ వైజాగు వదిలి ఎక్కడికో వెళ్లిపోయిందన్న సంగతి కూడా ఆర్నెలల దాకా నాకు తెలియనే లేదు. ఐ.ఎమ్.ఏ. సెమినార్‌కి వైజాగు వెళ్లినప్పుడు అమ్మని చూద్దామని ఇంటికి వెళితే ఇంట్లో ఇంకెవరో ఉన్నారు.

అమ్మ గురించి అడిగితే అమ్మ ఇల్లు వాళ్లకి అమ్మేసి వెళ్లిపోయిందన్నారు. ఎక్కడికి వెళ్లిందో వాళ్లకి తెలియదన్నారు. ఇరుగు పొరుగుల వాళ్ళని అడిగితే వాళ్లూ ఏమీ తెలీదన్నారు. ఉన్నట్టుండి అమ్మ అలా అదృశ్యం అయింతర్వాత ఆమెను చూసినవారెవరూ లేరు-ఏవేవో పుకార్లు తప్ప. 1991 గోదావరి పుష్కరాల్లో కొట్టుకువచ్చిన శవం అచ్చం అమ్మలాగే వుందని కొందరన్నారు. తమ్ముణ్ణి కాంటాక్టు చేస్తే వాడూ అమ్మ తన దగ్గరికి రాలేదని, తనకేమీ తెలియదనీ చెప్పేడు.


అమ్మ ఎక్కడికి వెళ్లిపోయిందో, ఎందుకు వెళ్లిపోయిందో తెలియదు. ఏళ్లు గడుస్తున్నా ఆమె ఆచూకీ తెలియలేదు.

అరవై ఏళ్ల ముసల్ది ఎవరి ఆసరా లేకుండా ఎలా బతుకుతుంది? ఇన్నేళ్లయినా అమ్మ ఆచూకీ తెలియక పోవడంతో అమ్మ బతికి వుందన్న ఆశ సన్నగిల్లిపోయింది.

అమ్మ కనిపించకుండా పోయి ఇరవై ఏళ్లయింది. క్రమంగా అమ్మని అందరం మరిచేపోయారు.

ఇవాళ ఈ 'అమ్మ' ఎవరో చనిపోయి, తన అమ్మని గుర్తు చేసింది. చనిపోయిన ఈ 'అమ్మ' ఎవరో కానీ మరిచిపోయిన మా అమ్మని పునరుజ్జీవింపజేసింది. అమ్మ! కన్న కొడుకుల కోసం ఎన్ని త్యాగాలు చేసింది అమ్మ! భావనారాయణ మనసు కలుక్కుమంది. ఎన్ని జన్మలెత్తినా అమ్మ ఋణం తీర్చుకోగలడా?

తన సర్వస్వం-ఆశలు, ఆకాంక్షలు, ఆత్మీయత, అనురాగం అన్నీ కన్నబిడ్డల ఉన్నతికోసం అర్పణ చేసిన అమృతమూర్తి అమ్మ కంటే, అదును చూసి ఆర్థికంగా ఆదుకున్న భుజంగం గారు తన ఉన్నతికి బంగారు బాటలు వేసిన భగవత్స్వరూపుడిగా కనిపించాడు. డబ్బు వెదజల్లి ఆయన, దయా దాక్షిణ్యాల ముసుగులో, తనని అతి చలాకీగా అమ్మానాన్నల నుంచి తన్నుకుపోయిన రాబందని అప్పట్లో తను అప్పట్లో ఏమిటి ఇప్పటి దాకా తెలుసుకోలేకపోయాడు. ఆదరణ వెనుక అతని అసలు స్వార్థం తెలుసుకోలేక అమ్మానాన్నల్ని దూరం చేసుకుని అతని ఉచ్చుల్లో తను బిగుసుకుపోయాడు. తనని అమ్మానాన్నలతో ఉండకుండా వాళ్ల నుంచి వేరు చేశాడని గ్రహించుకోలేకపోయాడు. తన మామగారిలాంటి మరో రాబందు ఫణిభూషణంగారి రూపంలో తమ్ముణ్ణి తన్నుకుపోయింది. నడిమంత్రపు సిరిలో మునిగితేలుతూ అన్నదమ్ములం అమ్మా నాన్నల్ని ఏనాడైనా ఆదుకున్నామా? వాళ్లు ఎలాంటి నిరాదరణకి, అవమానాలకి లోనయ్యారో పట్టించుకున్నారా? నాన్న చచ్చిపోతే వెంట పెళ్లాల్ని తీసుకువెళ్లకుండా అన్నదమ్ములం ఒక్కళ్లమే ఏదో షికారుకు వెళ్లినట్టు వెళితే అమ్మ మనసు అప్పుడు



ఎంత క్షోభించి ఉంటుంది? పైగా పెళ్లాలకి ఇంట్లో జీతం బత్తెం లేని పనిమనిషిగా పనికొస్తుందని ఆరేసి నెలలు మా దగ్గర ఉంచుకుంటామన్నప్పుడు ఆ తల్లి గుండెలు ఎంత విలవిల్లాడిపోయుంటాయో!

ఇద్దరు కొడుకులుండి దిక్కుమాలిన అనాథగా ఎక్కడో చచ్చిపోయింది అమ్మ! అతడి కళ్లు చెమ్మగిల్లాయి. ఒక్కమారు అతన్లో తల్లిప్రేమ పెల్లుబికి ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతడి జ్ఞాపకాలకి బ్రేక్ వేస్తూ 'వుయ్ ఆర్ అప్రోచింగ్ డమ్ డమ్. ప్లీజ్ ఫాస్టెన్ యువర్ సీట్ బెల్ట్స్' అన్న ఎయిర్ హోస్టెస్ ఎనౌన్సుమెంటు వినిపించింది.

భావనారాయణ ఎయిర్ పోర్టు నుంచి నేరుగా హౌరా స్టేషన్ చేరుకుని, హౌరా-అమృతసర్ పంజాబ్ మెయిల్ అందుకున్నాడు. అది మర్నాడు ఉదయం వారణాసి చేరుకుంటుంది.

★ ★ ★

కలకత్తాలో వున్న కళ్యాణ చక్రవర్తి టెలిగ్రాం అందగానే భావనారాయణలాగే తర్జన భర్జన పడ్డాడు. ఎవరీ 'అమ్మ' మా అమ్మ ఎప్పుడో చచ్చిపోయుండాలి. ఇంకెక్కడి అమ్మ? కాశీలో 'అమ్మ ఆశ్రమం'కి చెందిన 'అమ్మ' ఎవరో చనిపోతే తనకెందుకు వచ్చింది టెలిగ్రాం? వాళ్లకి తన ఎడ్రస్ ఎలా తెలిసింది? ఆలోచించినకొద్దీ ఈ 'అమ్మ' తన అమ్మే కాదు కదా? అన్న అనుమానం లీలగా బుర్రలో మొలకెత్తింది. ఆ అనుమానం క్రమంగా పెరిగి 'బహుశా ఈ 'అమ్మ' మా అమ్మేనేమో! మా అమ్మే కాకపోతే నాకే ఎందుకు టెలిగ్రాం వస్తుంది? వాళ్లకి నా ఎడ్రస్ ఎలా తెలిసింది? పైగా అమ్మ కచ్చితంగా చచ్చిపోయినట్టు తమ వద్ద ఎలాంటి దాఖలాలూ లేవు. ఇరవై ఏళ్లయి ఆమె జాడ తెలియకపోవడంతో ఆమె చచ్చిపోయిందని లెఖ్ఖ కట్టేశాం. బహుశా ఇన్నేళ్లాయి అమ్మ కాశీలో బతికే ఉందేమో!' అని అతడి మనసు ఊగిసలాడింది. సాధారణంగా వయసు మళ్లిన ముసలి వాళ్ళూ ముఖ్యంగా ఆదరించేవాళ్లు ఎవరూ లేక అనాదరణకి గురైన ఆడవాళ్లూ, వితంతువులూ శేష జీవితం కాశీలో గడిపి అక్కడే గంగలో కలిసిపోదామని కాశీ వెళ్తారు. అమ్మ కూడా ఇరవై ఏళ్ల కిందట కాశీయే వెళ్లిపోయుంటుంది. సందేహం లేదు. ఈ 'అమ్మ' తన అమ్మే!

శ్రీమతిని పిలిచి, విషయం ఏమిటో చెప్పకుండా ''నేను బెనారెస్ వెళ్తున్నాను'' అన్నాడు, టెలిగ్రాం ఆమె చేతికి అందించి.

మొదట కంగారు పడినా టెలిగ్రాం చదివాక ''మీకు నిజంగా మతిభ్రమించింది. ఎవరో 'అమ్మ' అన్నావిడ బెనారెస్‌లో చనిపోయిందని టెలిగ్రాం వస్తే ఎప్పుడో చచ్చిపోయిన మీ అమ్మే కొత్తగా చనిపోయినట్టు హడావిడి చేస్తున్నారేమిటి?'' అని ఎకసక్కెం చేసింది.

''నువ్వు విషయం సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఇరవై ఏళ్ల కిందట ఇల్లు విడిచి వెళ్లిపోయిన అమ్మ జాడ ఇన్నేళ్లాయి తెలియకపోవడంతో అమ్మ చనిపోయిందనే నిర్ధారించుకున్నాం. కాని నిజానికి ఆమె చనిపోయినట్టు సాక్ష్యాధారాలు ఏవీ లేవు. ఇప్పుడు ఈ టెలిగ్రాం ద్వారా మా అమ్మ నిన్నటిదాకా బతికే ఉందని, నిన్ననే బెనారెస్‌లో చనిపోయిందని, నేను ఆమె కొడుకుని కాబట్టి నాకు ఆ కబురు తెలియజెయ్యడం జరిగిందని స్పష్టం అవుతున్నది''

''చనిపోయిన అమ్మ మీ అమ్మే అని టెలిగ్రాంలో ఎక్కడ ఇండికేషన్ లేదే. 'యువర్ మదర్ ఎక్స్‌పైర్డ్' అని వుంటే పోనీ మీరన్నమాట సబబే. తలా తోకా లేని టెలిగ్రాం పట్టుకుని 'మా అమ్మ! మా అమ్మ!' అని చిందులు తొక్కుతున్నారేమిటి?'' అని సతాయించింది.

''ఎవరో అమ్మ చనిపోతే నాకెందుకు టెలిగ్రాం ఇస్తారు? ఆమె మా అమ్మ కాబట్టే వాళ్లకి నా ఎడ్రస్ తెలిసింది. ఇది తలా తోకా లేని టెలిగ్రాం కాదు. తలకాయ లేంది నీకే''

''సరే..మీ అమ్మే చనిపోయింది. అయితే ఏమిటట?''

''మా అమ్మ చావు నీకు అంత చులకనగా ఉందా? నేను వెంటనే బెనారెస్ వెళ్తున్నాను. అమ్మ అంత్యక్రియలన్నీ యథావిధిగా అక్కడ జరిపించి వస్తాను. కొడుకుగా ఇది నా కనీస ధర్మం. నువ్వు నాతో రానక్కర్లేదు. అత్తగారు చనిపోతే 'ఏమిటట' అని ఈసడించిన కోడలు ఆమె అంత్యక్రియలకి రావడం శుద్ధదండగ!'' అంత కటువుగా పెళ్లాంతో కళ్యాణ్ మాట్లాడ్డం ఇదే మొదటిసారి.

ఎన్నడూ ఎదురు తిరగని భర్త ఒక్క మారు కోపంతో బుసలుకొడుతుంటే ఆమె మరి మారు మాట్లాడలేదు. గతంలో అత్తగారి పట్ల తను ఎంత అసభ్యంగా ప్రవర్తించిందో, భర్తకి తెలియకుండా అత్తగార్ని ఎంత నిరాదరణ చేసి అవమానాలకి గురి చేసిందో ఒక్కమారు ఆమెకు కళ్లకు కట్టినట్టయి, భయవిహ్వల అయింది.

కళ్యాణ్ చక్రవర్తి ఆ సాయంత్రం హౌరా-అమృతసర్ పంజాబ్ మెయిల్లో వారణాసి బయల్దేరేడు. అదే రైల్లో అదే గమ్యస్థానానికి అన్నయ్య కూడా ప్రయాణం చేస్తున్నాడని కళ్యాణ్‌కి తెలియదు. బెర్తు మీద పడుకున్నాడే కాని కళ్యాణ్ కళ్లు మూతపడలేదు. కళ్ల ముందు అమ్మే కనిపిస్తున్నది. ఈ 'అమ్మ' తన అమ్మే కాదు కద! అమ్మ! రైలు ముందుకు ఉరకలు పెడుతుంటే అతడి జ్ఞాపకాలు వెనక్కి గతంలోకి పరుగెడుతున్నాయి.

★ ★ ★

'అమ్మ' ఆశ్రమం గంగ ఆవలి ఒడ్డున రామ్‌నగర్ పాలెస్‌కి చేరువలో ఉంది. వేర్వేరు టాక్సీల్లో ఆశ్రమం చేరుకున్న అన్నదమ్ములు అక్కడ ఒకరికొకరు తారసపడ్డారు. ఇద్దరూ ఆశ్రమం మేనేజరు రాధేశ్యామ్ పాండేజీని కలుసుకున్నారు.

''రండి! రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాను. టెలిగ్రాంలు అందాయో లేదో, ఎప్పటివో పాత ఎడ్రసులు- అక్కడ మీరు ఉన్నారో లేదో అని ఆందోళన పడ్డాను. మీరు వచ్చారు చాలా సంతోషం'' అని వాళ్లకి స్వాగతం చెప్పేడు పాండేజీ.

అన్నదమ్ములిద్దరూ పాండేజీని అడిగిన మొదటి ప్రశ్న- ''ఇంతకీ చనిపోయిన 'అమ్మ' ఎవరు? ఆమె చనిపోతే మాకెందుకు టెలిగ్రాంలు ఇచ్చారు?''

వాళ్ల ప్రశ్నకి విస్తుపోయిన పాండేజీ ''మీ ప్రశ్నలకి నా వద్ద ఎలాంటి జవాబూ లేదు. ఆమె 'అమ్మ'గా తప్ప పూర్వాశ్రమంలో ఆమె ఎవరో నాకూ తెలియదు. మీరొస్తే 'అమ్మ' గురించి మాకు తెలియని వివరాలు మీ ద్వారా తెలుస్తాయని నేనాశించాను. మీరేమో ఏకంగా 'అమ్మ' ఎవరని అడుగుతున్నారు. అమ్మ మీకు ఏమీ కారా?'' ఎదురుప్రశ్న వేశాడు.

''పేరూ ఊరూ లేకుండా 'అమ్మ' అంటే ఆమె ఎవరో మాకు ఎలా తెలుస్తుంది? పోనీ, అమ్మ ఫోటో చూపించండి. మాకు తెలిసిన మనిషంటే పోల్చి చెప్పగలం'' అన్నారు ఆశగా.

''సారీ! అమ్మ ఫోటో ఎక్కడా లేదు. తన ఫోటోలు తియ్యకుండా ఆమె నిషేధించారు. అందుకనే ఆమె చనిపోయాక కూడా ఆమె ఫోటో తియ్యలేదు''

''మేం ఎవరో మీకు తెలియదు. మరి అమ్మ చనిపోతే మాకెందుకు టెలి



గ్రాంలు ఇచ్చారు? అసలు మా ఎడ్రసులు మీకు ఎలా తెలిశాయి?'' ఎలాగైనా కూపీలాగి ఈ 'అమ్మ' తమ అమ్మే అని బుజువు చేసుకోవాలని వాళ్ల ఆశ.

''అమ్మ చనిపోయిన 15 రోజుల తర్వాత ఆమె గదుల్ని శుభ్రపరుస్తుంటే చెత్తల్లో నలిగిపోయిన రెండు స్లిప్పులు దొరికాయి. ఒకదానిమీద ఎవరిదో బెంగళూరు ఎడ్రస్సు, రెండో దానిమీద ఇంకెవరిదో కలకత్తా ఎడ్రస్సూ రాసి ఉన్నాయి. ఆ స్లిప్పులు అమ్మకి చెందినవని చెప్పలేను. ఎందుకంటే 'అమ్మ' మొదట్లో పై అంతస్తులో ఉండేవారు. రెండేళ్ల కిందట మెట్లు ఎక్కడం, దిగడం కష్టమనిపించి ఈ గదుల్లోకి షిఫ్టయారు. అంతకు ముందు ఈ గదుల్లో చాలామంది ఆశ్రమవాసులుండేవారు. ఈ స్లిప్పులు ఏ మూలో వాళ్లు వదిలిపెట్టినవి కావొచ్చు. అయినా ఒకవేళ స్లిప్పుల్లోని ఎడ్రస్సులకు చెందిన వ్యక్తులు 'అమ్మ'కి కావలసిన వాళ్లేమో! ఎందుకేనా మంచిది, ఆ ఎడ్రస్సులకు టెలిగ్రాంలు ఇస్తే ఏం పోయింది? అనిపించి, అంధుడు చెట్టు మీద కాయకోసం రాయి విసిరినట్టు, ఆ ఎడ్రస్‌లకి టెలిగ్రాం ఇచ్చాను. మీరొచ్చారు'' పాండేజీ తన చర్యను సమర్థించుకున్నాడు.

అన్నదమ్ములిద్దరూ 'అమ్మ' ఎవరో ఎటువంటి 'క్లూ' దొరక్కపోవడంతో చాలా నిరాశ పడ్డారు.

''పాండేజీ! ఎక్కణ్ణుంచో ఇక్కడికి వచ్చిన 'అమ్మ' ఈ ఆశ్రమం ఒక్కర్తే వృద్ధురాలు ఎలా కట్టించిందో వివరాలు చెబుతారా? ఆమె ఏ ప్రాంతవాసి? పూర్వాశ్రమంలో ఆమె పేరేమిటి?'' అని ఇంకా ఆశ చావక మళ్లీ అడిగారు.

''నేను అమ్మ ఆశ్రమం 'చాలూ' చేసిన మూడేళ్ల తర్వాత ఇక్కడికొచ్చాను. అప్పుడు నేను కావలసిన వాళ్ల వెన్నుపోటు పొడవగా తట్టుకోలేక నిరాశా నిస్పృహల్తో అనాధగా ఇక్కడికొచ్చాను. 'అమ్మ' నన్ను చేరదీసి ఆశ్రయం ఇవ్వడమేగాక క్రమంగా నాకు ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఏ జన్మ అనుబంధమో నన్ను సొంత కొడుకులా చూసుకునేవారు. నాకు తెలిసినమట్టుకు 'అమ్మ' కొంత డబ్బుతో ఇరవైయ్యేళ్ల కిందట ఈ ఊరొచ్చి అనాథాశ్రమం స్థాపించడానికి రామ్ నగర్ రాజ కుటుంబీకుల సహాయం అర్థించారట. వారు ఆశ్రమం కట్టుకుందికి ఈ స్థలాన్ని ఉచితంగా ఇవ్వడమేగాక తామూ కొంత ఆర్థిక సహాయం చేశారట. వారి పలుకుబడితో మరికొంత మంది దాతలు విరాళాలిచ్చేరు. అందరి సహాయ సహకారాల్తో 'అమ్మ' ఆశ్రమం కార్యరూపం దాల్చింది. ఇంతకుమించి నాకు తెలియదు. 'అమ్మ' ఊరూ పేరు కూడా ఎవరికీ తెలియదు. 'పుట్టకముందు మనిషికి నామ రూపాలు లేవు. చచ్చిపోయాకా ఉండవు. మధ్యలో తెచ్చిపెట్టుకున్న నామరూపాలు మిధ్యయే! ఈ లోకమే నీకు శాశ్వతం కానప్పుడు ఏ ఊరైనా నీ ఊరెలా అవుతుంది? అనే వారు అమ్మ''

పాండేజీ జవాబు విన్నాక 'అమ్మ' ఎవరో తెలుసుకోవడం అసంభవం అని తేలిపోయింది. 'అమ్మ' ఎవరైతేనేం? ఈ అమ్మ తమ కళ్లు తెరిపించింది. మరిచిపోయిన అమ్మని తమలో జాగృతం చేసింది. అంచేత ఈ 'అమ్మ'ని తమ అమ్మగానే భావించి, కొడుకులుగా పాపప్రక్షాళన చేసుకోవాలి-అని అన్నదమ్ములు నిశ్చయించుకున్నారు. అయితే ఆశ్రమవాసులకి తమ తల్లి కథ చెప్పడానికి వాళ్లకి జంకు పుట్టింది. అంతా విన్నాక తల్లిని క్షోభ పెట్టిన కిరాతకులుగా తమ మీద వాళ్లకి అసహ్యం పుట్టవచ్చు. అంచేత వచ్చినవాళ్లు ఇక్కణ్ణుంచి మర్యాదగా వెళ్లిపోవాలంటే తాము బయటక పడక పోవటమే మంచిది.

''పాండేజీ! మాదో చిన్న మనవి. 'అమ్మ' ఇంతమందికి అమ్మ అయినప్పుడు మాకూ అమ్మే. మేమూ అమ్మని పోగొట్టుకున్నాం. అంచేత 'అమ్మ' స్థాపించిన ఈ ఆశ్రమం ఇలాగే ఆర్తులను, అనాథల్నీ ఆదుకునేందుకు వీలుగా మావంతు ఉడతా భక్తి, చెరో 50 వేల రూపాయలు 'అమ్మ' ఆశ్రమంకి విరాళం ఇయ్యదల్చుకున్నాం. దీన్ని గుప్త దానంగా మీరు స్వీకరించక తప్పదు'' అని చెరో ఏభై వేలకి చెక్కులు రాసి పాండేజీకి ఇచ్చారు. పాండేజీ కృతజ్ఞతా పూర్వకంగా ఆ చెక్కులు అందుకుంటూ ''అమ్మ ఆశీర్వాదాలు సదా మీకు ఉంటాయి'' అన్నాడు, వాళ్ల ఉదారతకి ఆశ్చర్యపోతూ.

అన్నదమ్ములిద్దరూ ఒకే టాక్సీమీద వారణాసి స్టేషన్‌కి బయల్దేరేరు. దోవలో వాళ్ళు మరో నిర్ణయం తీసుకున్నారు. 'అమ్మ' తమ అమ్మే కావొచ్చు. కాకపోవచ్చు. తమ ఎడ్రసులున్న చీటీ ముక్కలు దొరికాయన్న చిన్న ఆధారంతో 'అమ్మ' తమ అమ్మేనని నిక్కచ్చిగా నిర్ధారణ చేయడం సరి కాదు.


'అమ్మ' కంటిముందు ఆ గదుల్లో ఉండిన వాళ్ల లోగడ తమకి తెలిసినవాళ్లో, తమ వద్ద పని చేసినవాళ్లో, తమ వల్ల ఏదో లబ్దిపొందిన వాళ్లో అయుండొచ్చు. వాళ్లు ఎడ్రసులు రాసి ఉంచుకున్న చీటీ ముక్కల్ని ఆ గదుల్లో ఏ మూలో పారేసుకుని ఉండవచ్చు. అంత మాత్రాన 'అమ్మ' తమ అమ్మేనని అన్వయించుకోవడం సబబు కాదు. అంతెందుకు, అమ్మే ఎక్కడెక్కడో తిరిగి ఇక్కడికొచ్చి, ఈ ఆశ్రమంలో ఉంటూ చనిపోయి ఉండొచ్చు. ఆమె వదిలేసిన ఎడ్రస్ స్లిప్పులే ఇప్పుడు కాకతాళీయంగా దొరికాయేమో! అంచేత 'అమ్మ' ఎవరైనా కానీ తమలో నిద్రాణమైన మానవత్వాన్ని ప్రబోధింపజేసింది.

కొడుకులై అమ్మ ఋణం తీర్చుకునే ఆఖరి అవకాశం ఇప్పుడు కలిగింది. అంచేత ఇక్కడి నుంచి తిన్నగా ఇళ్లకి వెళ్లిపోక, ముందు అమ్మకి గయలో శాశ్వత పిండ తర్పణ చెయ్యాలి. ఆ విధంగా కొంతవరకేనా పాపప్రక్షాళన చేసుకోవాలి. తర్వాత గయ నుంచి ఇళ్లకి వెళ్లాక, పెళ్లాల్తో చనిపోయిన 'అమ్మ' తమ అమ్మేననీ, కాశీలో ఘనంగా అమ్మకి కర్మకాండ చేసి వచ్చామని చెబుతారు.

★ ★ ★

ఇంతకీ కాశీలో చనిపోయిన 'అమ్మ' ఎవరు? భావనారాయణ, కల్యాణ్‌లాంటి కృతఘ్నులయిన కొడుకుల్ని కన్న అన్నపూర్ణమ్మా? లేక కన్నకొడుకులకి అమ్మ అక్కర్లేకపోతే కాశీ చేరుకుని ఎందరో అనాధలకు 'అమ్మ' అయిన మరో అమ్మా? చచ్చిపోయిన మనిషి తన కథ తాను చెప్పుకోలేదు.

చావు శరీరానికే కాని ఆత్మకు కాదు గనుక 'అమ్మ' ఆత్మ స్పందనకి అక్షర రూపం ఇస్తే ఈ కథ ఏ మలుపు తిరుగుతుందో! 'అమ్మ' కథ అందరి అమ్మల కథ.




కన్న కలలు కల్లలైపోయి, పెంచుకున్న ఆశలు పేరాశలు కాగా, మనసు నింపుకున్న మమతలు మట్టిపాలయ్యాక, చేసిన త్యాగాలు కొరగాకపోయాక, కన్న సంతానం వెన్నుపోటు పొడిస్తే విలవిలా తల్లడిల్లిపోయిన ఏ కన్నతల్లి కన్నీటి గాథ అయినా ఆమె 'ఆత్మ' కథగా చెప్పడం-చచ్చాకా కూడా ఆ అమ్మ ఆత్మ శాంతికి భంగం కలిగించడమే ఔతుంది. అంచేత 'అమ్మ' ఎవరి అమ్మ అయితేనేం- 'మే హర్ సోల్ రెస్ట్ ఇన్ పీస్'. అమ్మ ఆత్మకు శాంతి కలుగుగాక! ☆